

జన్వాడ ఫాంహౌస్.. నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే: కాంగ్రెస్ ఎంపీలు 6

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -101 ఆదివారం 20 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి : ప్రజలను కోరిన సీఎం రేవంత్



**హైదరాబాద్‌సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం మిగతా 2లో...

# విద్యార్థులకు నాణ్యమైన సామాగ్రి ఇవ్వాలి



**మరిన్ని రంగుల్లో యూనిఫామ్స్ ఇవ్వండి**


**వచ్చే ఏడాది కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక చేయాలి**

**సమీక్షా సమావేశంలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. శనివారంనాడాయన విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుతోపాటు వివిధ శాఖలమిగతా 2లో...

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన



**ఢిల్లీ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు మిగతా 2లో...

## తిరుమలలో వైభవంగా గరుడ సేవ..

**రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు**

**శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ**

**గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి**

**లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

**గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ**

**భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ**



**తిరుమలసెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చినమిగతా 2లో...

## అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం



ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, మిగతా 2లో...

## కొత్త రూల్‌పై గందరగోళం

**యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు..**

**రూ.2000 దాటిన యూపీఐ లావాదేవీలపై కొత్త ఛార్జీల ప్రతిపాదన**

**నిరసనగా యూపీఐ చెల్లింపులు నిలిపివేస్తామంటున్న వ్యాపారులు**

**అక్టోబర్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆందోళన**

**ఈ ఛార్జీ వ్యాపారులకే తప్ప, వినియోగదారులకు కాదంటున్న ప్రభుత్వం**

**95 శాతం లావాదేవీలపై ప్రభావం ఉండదని స్పష్టీకరణ**







## భారతీయులకు పెరిగిన వీసా టెన్షన్

**అమెరికా యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల దెబ్బ..**

**వీసా జాప్యం, తిరస్కరణలే ప్రధాన కారణాలు**

**63 శాతం యూనివర్సిటీ అధికారుల్లో ఇమ్మిగ్రేషన్‌పై ఆందోళన**

**విదేశీ విద్యార్థులు తగ్గడంతో 73 శాతం సంస్థల ఆదాయంతో తగ్గుదల**

**భారతీయ విద్యార్థులకు కీలకంగా మారిన వీసా పరిస్థితులు**

**ఢిల్లీ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విదేశీ విద్యార్థులకు పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా కనిపించడం లేదు. 2026 విద్యా సంవత్సరానికి అమెరికాలోని సగానికి పైగా కాలేజీలు, యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థులమిగతా 2లో...

# ఎకరం ఎండినా సీఎందే బాధ్యత

## ఎల్ నినో రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటకలో లేదా.?

**ప్రకృతిది కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరువు రేవంత్ రెడ్డిది అసమర్థ పాలన..**

**పార్టీ ఫిరాయింపులో హైకోర్టు తీర్పు చెంపపెట్టు? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వనపర్తి జిల్లాలో జూరాల కాలువ, సబ్ స్టేషన్ల పరిశీలన**

**పెబ్బేరుసెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** 'ఎల్ నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాలలో లేదా.? రైతులకు నీళ్లు ఇవ్వలేని రేవంత్ రెడ్డిది.. అసమర్థ పాలన. ఎకరం పొలం ఎండినా సీఎందే బాధ్యత. ఇది ప్రకృతి తెచ్చినది కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ పర్యటనలో భాగంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పర్యటించిన కేటీఆర్ జూరాలమిగతా 2లో...



## యువతే తెలంగాణకు అతిపెద్ద బలం

**వికసిత్ భారత్ లో తెలంగాణది కీలక పాత్ర**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం: డిప్యూటీ సీఎం**



**న్యూఢిల్లీ:** వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగామిగతా 2లో...

## జపాన్‌లో20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం

**భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ**

**ప్రారంభోత్సవంలో పతాకధారులుగా షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్**

**గత ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు గెలవాలనే లక్ష్యంతో భారత్**

**క్రికెట్, కబడ్డీ, హాకీలో టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తున్న టీమిండియా**



**ఢిల్లీ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాలమిగతా 2లో...

# తిరుమలలో వైభవంగా గరుడ సేవ..

**మొదటిపేజీ తరువాయి**

భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు. గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు,



తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు.

వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# కొత్త రూల్‌పై గందరగోళం

**యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు..**

**ఢిల్లీ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**
దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. ఘజియాబాద్‌లోని పలువురు వ్యాపారులు దీనికి నిరసనగా తమ దుకాణాల ముందు 'యూపీఐ చెల్లింపులు స్వీకరించబడవు' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైబడిన ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయమే ఈ ఆందోళనకు కారణం.

వ్యాపారులు ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపైనే ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త ఛార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుందని వారు చెబుతున్నారు.

**అక్టోబర్ 15 నుంచి ఏం మారుతుంది?**

కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి




వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్-టు-మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ ఛార్జీ గరిష్టంగా రూ.300గా పరిమితం చేశారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపువే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.

**ప్రభుత్వం ఏమంటోంది?**

ఈ ఛార్జీల భారాన్ని పూర్తిగా వ్యాపారులే భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఒకవేళ వ్యాపారులు బిల్లులపై 'యూపీఐ ఛార్జీ' అని ప్రత్యేకంగా వేయడం ప్రారంభిస్తే, యూపీఐ ఇక ఉచితం కాదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇది డిజిటల్ చెల్లింపుల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే, ఈ భారం వినియోగదారులపై పడకుండా చూసేందుకు పేమెంట్ అగ్రిగేటర్లు, బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

**ప్రజలు తిరిగి నగదు వైపు వెళ్తారా?**

ఈ కొత్త ఛార్జీల వల్ల ప్రజలు మళ్లీ నగదు వాడకం వైపు మళ్లుతారని ప్రభుత్వం భావించడం లేదు. మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణంలో కేవలం 4 శాతం మాత్రమే ఈ కొత్త లెవీ పరిధిలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో జరిగిన పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో 86 శాతం రూ.500 లోపువే కాగా, మరో 10 శాతం రూ.501 నుంచి రూ.2,000 మధ్య ఉన్నాయి.

కాబట్టి సామాన్య ప్రజల రోజువారీ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మరోవైపు, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఇది వ్యాపారులకు, వినియోగదారులకు మరో డిజిటల్ చెల్లింపు మార్గంగా అందుబాటులో ఉంటుంది.

# ఎకరం ఎండినా సీఎందే బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

కాల్వలల్లోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ కరుణశ్రీ సాయి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఎల్ నినో పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, పంటలకు సాగునీరు ఇవ్వకపోవడమే కాకుండా విద్యుత్ కోతలతోనూ పంటలు ఎండిపోతున్నాయన్నారు. జూరాల డ్యామ్ లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కు ఎగువ ఉన్న పోతిరెడ్డిపాడు వెలిగొండ ప్రాజెక్టులకు 100 టీఎంసీల నీరు విడుదల చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం సాగుకు కృష్ణా జలాలను పాలమూరు రైతులకు ఇవ్వలేకపోతుందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నీటిని జూరాలకు తరలించవచ్చు కదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆల్మట్టి నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద ఐదు మీటర్ల ఎత్తు పెంచడానికి కర్నాటక ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనేక రిజర్వాయర్లకు సాగునీరు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ను రూ.84 వేల కోట్లతో 40 టీఎంసీల నీటి కోసం కేసీఆర్ నిర్మిస్తే దానికి రేవంత్‌రెడ్డి కాకిగోల చేస్తున్నారని విమర్శించారు.

కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగునీరు పోతుంది, కానీ పైన ఉన్న తెలంగాణకు నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం గురువు మీద ఉన్న ప్రేమతోనే రేవంత్ రెడ్డి ప్రశ్నించడం లేదని విమర్శించారు. అత్యల్పంగా కృష్ణా నీటిని వినియోగించుకున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డిదే అని అన్నారు. కల్వకుర్తి లిఫ్టులను కొనసాగించకుండా రైతులకు సాగునీరు అందించకుండా ప్రభుత్వమే ఇబ్బందులు పెడుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 6 గంటలు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. తొలి వికెట్ దానం నాగేందర్ అని, మిగతా వారిని కూడా తొందర్లోనే పడగొడతామన్నారు. పార్టీ ఫిరాయించిన వారందరూ రాజీనామా చేసి గెలవాలన్నారు. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, ప్రజల కష్టాలన్నీ తీరుస్తుందని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, పెబ్బేరు మండల పట్టణ పార్టీ అధ్యక్షులు వనం రాములు, దిలీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కరుణశ్రీ, హరి శంకర్ నాయుడు, సౌజన్య, మన్యం, పార్టీ నాయకులు కర్రె స్వామి, పెద్దింటి వెంకటేష్, సాయి, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు. +వశీస్త్రతీఖుజూష్త్రఅఎ =వటవతీవఅఎవ

**ఎకరం ఎండినా సీఎందే బాధ్యత**

రైతాంగం సాగు చేసిన పంటలకు నీళ్లు ఇవ్వడం లేదనీ, ఎకరం ఎండినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని కేటీఆర్ హెచ్చరించారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడం, పెబ్బేరు సబ్ స్టేషన్లు పరిశీలించారు. పెబ్బేరు సబ్ స్టేషన్ నుంచి సుభాష్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున రైతులతో ర్యాలీగా వచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ పర్యటన కొనసాగింది. పెబ్బేరులో పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. రైతులకు 24 గంటల పాటు కరెంటు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేవలం ఆరు గంటలు మాత్రమే ఇచ్చి దగా చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సొంత గ్రామంలోని రైతులే ఆందోళన చేస్తున్నారని దానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎల్‌నినో ప్రభావం అని చెప్పడం సిగ్గుచేటన్నారు. పాలమూరు ముఖ్యమంత్రిని ప్రజలు తీసుకొస్తే ఆయన పాలమూరు రైతుల నోట్లో మట్టి కొట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులు గట్టు యాదవ్, మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# యువతే తెలంగాణకు అతిపెద్ద బలం

**మొదటిపేజీ తరువాయి**

కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని వివరించారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంరాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్ని తెలిపారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

**మొదటిపేజీ తరువాయి**

'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

**మొదటిపేజీ తరువాయి**

సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+గా కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# భారతీయులకు పెరిగిన వీసా టెన్షన్

**మొదటిపేజీ తరువాయి**

నుంచి వచ్చే దరఖాస్తులు తగ్గినట్లు తాజా సర్వే వెల్లడించింది. వీసాల జారీ ఆలస్యం, వీసా తిరస్కరణలు, కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ పరిణామాలతో ముఖ్యంగా భారత్, చైనా నుంచి అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది.

అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ (ఏసీఈ) 328 మంది ఉన్నత విద్యా సంస్థల సీనియర్ అధికారులతో ఈ సర్వే నిర్వహించింది. ఇందులో 63 శాతం మంది ఇమ్మిగ్రేషన్ ఆంక్షలు, వీసాల రద్దుపై తీవ్రంగా లేదా కొంతమేర ఆందోళన ఉన్నట్లు చెప్పారు. అంతేకాదు.. 36 శాతం మంది ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యూనివర్సిటీలు సిద్ధంగా లేవని తెలిపారు.

అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం అమెరికా యూనివర్సిటీల అడ్మిషన్లపైనే కాదు.. వాటి ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం చూపుతుంది. విదేశీ విద్యార్థులను చేర్చుకునే యూనివర్సిటీల అధ్యక్షుల్లో 73 శాతం మంది.. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తమ ఆదాయం కూడా తగ్గిందని తెలిపారు.

దీని ప్రభావం ఇప్పటికే కొన్ని క్యాంపస్‌లలో కనిపిస్తోంది. 23 శాతం మంది అధికారులు పరిశోధనలు, విద్యార్థుల సహాయ కార్యక్రమాలకు కేటాయించే బడ్జెట్‌ను తగ్గించినట్లు చెప్పారు. 9 శాతం మంది కొన్ని కోర్సులను మూసివేయడం లేదా ఇతర కోర్సులతో విలీనం చేయాల్సి వచ్చిందన్నారు. మరో 11 శాతం మంది విద్యార్థులకు ఇచ్చే ఆర్థిక సాయం తగ్గినట్లు వెల్లడించారు.

అమెరికా యూనివర్సిటీలో సీటు రావడం ఒక్కటే ఇప్పుడు సరిపోదు. అడ్మిషన్ వచ్చిన తర్వాత వీసా ఎప్పుడు వస్తుంది? ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో ఏమైనా మార్పులు వస్తాయా? అనే అంశాలు కూడా విద్యార్థులకు కీలకంగా మారాయి. వీసా ప్రక్రియ ఆలస్యమైతే, నిర్ణయించిన సమయానికి విద్యార్థులు అమెరికా వెళ్లి తరగతులకు హాజరుకావడం కష్టమవుతుంది. అదే సమయంలో వీసాలపై అనిశ్చితి కొనసాగితే యూనివర్సిటీలు కూడా విదేశీ విద్యార్థుల సంఖ్యను అంచనా వేయడం కష్టమవుతుంది.

ఇప్పటికే అమెరికా యూనివర్సిటీల్లో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం ప్రధాన ఆందోళనగా మారింది. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థుల దరఖాస్తులు, అడ్మిషన్లు తగ్గడం అక్కడి విద్యా సంస్థలకు మరో సవాలుగా మారుతోంది.

# అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం

**మొదటిపేజీ తరువాయి**

ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన సామాగ్రి ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నతాధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, సైదులు, సంతోష్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భవంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన వస్తువుల పంపిణీ వివరాలను అధికారులు సీఎంకు నివేదించారు. విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందనీ, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేశామన్నారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. ఆయా వివరాల పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తక్షణం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాల ప్రకారం పనిచేసిన అధికారుల్ని అభినందించారు.

# జపాన్‌లో 20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

కోసం పోటీ పడనున్నారు. ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. "ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది. ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు. ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

## 16 ఏళ్లలోపు పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగంపై నిషేధం విధించాలి



**హుజురాబాద్/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్‌చంద్రబోస్ కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అధిక నిధులు కేటాయించాలని అన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని నిషేధిస్తూ శాసనసభలో చట్టం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్పించాలని సూచించారు. బాలలతో పని చేయిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. సెప్టెంబర్ 20 నుంచి జిల్లా కేంద్రాల్లో బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు అందించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అన్నదానంతో ఆధ్యాత్మిక సందడి

## 'అన్నదానం మహాదానం'.. భక్తులకు ఘనంగా ప్రసాద వితరణ

**రామడుగు/ సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
వినాయక నవరాత్రి ఉత్సవాలు రామడుగు మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మాల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గణనాథుని దర్శనం అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.
ఈ సందర్భంగా తహసీల్దార్ దాసరి రాజమల్లయ్య, ఎస్ఐ కే.రాజు మాట్లాడుతూ.. వినాయకుడి కృపతో ప్రతి ఏటా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. పూజలు, భజనలతో పాటు 'అన్నదానం మహాదానం' అనే సంకల్పంతో భక్తులకు అన్నప్రసాదం అందించడం సామాజిక సేవకు నిదర్శనమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో



ఐక్యత, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**

అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో పనిచేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు స్వయంగా వడ్డిస్తూ అన్నప్రసాదం అందించారు. క్రమశిక్షణతో ప్రసాద వితరణ జరిగేలా పర్యవేక్షించారు.
అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.
కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిజ్, 14వ వార్డు సభ్యురాలు సిరికొండ పల్లవి సాయి, ఉత్సవ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి వృద్ధురాలు మృతి

**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**



ఎల్కతుర్తి మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన అబ్బనవెన ఎల్లమ్మ (75) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎల్కతుర్తి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లమ్మ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 18న ఉదయం 6 గంటల సమయంలో ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం 6.50 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమార్తె ముల్కలపల్లి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్కతుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

## విద్యార్థుల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలి - ప్రధానోపాధ్యాయులు ఏ. శ్రీనివాస్

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి నడవడిక, క్రమశిక్షణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని భీమారం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఏ. శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పాఠశాలలో తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని, చదువుపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను



ఎప్పటికప్పుడు గమనించాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను సంప్రదించాలని కోరారు. రోజువారీ హోంవర్క్, ఉపాధ్యాయులు ఇచ్చే పనులను పూర్తి చేస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థుల డైరీ పరిశీలించడం ద్వారా తెలుసుకోవాలన్నారు.
పాఠశాలలో చేరిన తర్వాత తమ పిల్లల ప్రవర్తనలో మంచి మార్పు వచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రదర్శించే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడిన తీరును తల్లిదండ్రులు ప్రశంసించారు.
కార్యక్రమంలో ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెలతో పాటు ఉపాధ్యాయులు ఉషారాణి, చేరాలు, సరోజ, శ్రీనివాస్, తిరుపతి, అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## విద్యార్థులకు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు సూచన



**ఖమ్మం/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత, బీజేపీ తెలంగాణ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అన్నారు. ఖమ్మం అర్బన్ మండలంలోని కైకొండగూడెం జడ్పీహెచ్ఎస్‌లో శనివారం డ్రగ్స్, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థులతో మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఆరోగ్యంతో పాటు చదువు, కుటుంబం, భవిష్యత్తుపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. యువత ఆరోగ్యంగా, బాధ్యతగా ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ 'మత్తుకు దూరంభవిష్యత్తుకు బాట' అనే సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి. పద్మావతి, బెన్ని ప్రభుదాస్, ఆదిల్, ఏ. లక్ష్మీ, రిజ్వాన్, బి.వి. సుబ్బారావు, బి. వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# దాడికి గురైన కాంగ్రెస్ నేతకు కడియం శ్రీహరి పరామర్శ

## నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి.. హింసాత్మక ఘటనలను సహించేది లేదు

**వరంగల్/ఎంజీఎం సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలం కేశవనగర్ గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న కడియం శ్రీహరి. లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులకు సూచించారు. అనంతరం బాధితుడు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా



ఇచ్చారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదన్నారు. రాజకీయాల్లో హింసాత్మక ఘటనలను సహించేది లేదని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని,



ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మ పేరుతో మొక్క..

## భవిష్యత్తుకు బహుమతి



**సత్తుపల్లి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
అమ్మ పేరుతో మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు పచ్చని భవిష్యత్తును అందించాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నర్సింహ, మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ పిలుపు మేరకు శనివారం విశ్వశాంతి విద్యాలయంలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడినప్పుడే కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతిని ప్రేమిస్తూ చెట్లను సంరక్షిస్తామని, నీటిని వృథా చేయకుండా పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

# వాతావరణాన్ని జయించేలా పంటల మార్పిడి.

## -వ్యవసాయ అధికారి కే.రాజు.




**బయ్యారం/,సెప్టెంబర్ 19.(జర్నలిస్ట్ వార్త)**
ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపడం అభినందనీయమని వ్యవసాయ శాఖ అధికారి కే.రాజు అన్నారు. బయ్యారం మండలంలోని ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో గల రైతులు గాజుల వెంకన్న,గాజుల సైదమ్మలకు చెందిన 6 ఎకరాల పొలంలో నిర్వహించిన మినుము పంట విత్తే కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు,నీటి లభ్యతను బట్టి పంటల వైవిధ్యీకరణ చేపట్టడం వల్ల సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా ప్రతికూల పరిస్థితులను తట్టుకోవచ్చని పేర్కొన్నారు. రైతులందరూ నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ఎంచుకొని లాభదాయకమైన వ్యవసాయం చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ ఎన్.అమృత రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.




# పెనుగొండలో ఉత్సాహంగా క్రీడోత్సవాలు

## విజేతలకు బహుమతులు అందజేసిన ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి



**కేసముద్రం/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండలం పెనుగొండలో జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. పోటీల అనంతరం విజేతలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి బహుమతులు అందజేశారు. వేం చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఈ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న వేం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకల లక్ష్మీ కొమురయ్య, ఎస్సై క్రాంతికిరణ్, ఆర్టీఏ సభ్యుడు రావుల మురళి, కాంగ్రెస్ నాయకులు కూరెల్లి సతీష్, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

# ఆస్తుల లెక్కలు చెప్పాలి!

## బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి? : కడియం శ్రీహరి





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 19 (జర్నలిస్టు వార్త):**
బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ వనరులను దోచుకుని వేల కోట్ల ఆస్తులు కూడబెట్టుకున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. 2014కు ముందు కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎంత? 2026 నాటికి ఆస్తుల విలువ ఎంత? పదేళ్లలో వేల కోట్ల ఆస్తులు ఎలా సమకూరాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆస్తులపై వివరణ ఇవ్వకుండా ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై 36 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.36.04 లక్షలు, 33 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.17.11 లక్షల విలువైన చెక్కులు అందజేశారు.

**దేవాదులే రైతులకు దిక్కు**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఉన్నా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో దేవాదుల ద్వారా రిజర్వాయర్లను నింపి పంటలకు సాగునీరు అందిస్తున్నామని కడియం శ్రీహరి తెలిపారు. 20 ఏళ్ల క్రితం చిన్న పథకంగా ప్రారంభమైన దేవాదుల నేడు ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. తన రాజకీయ జీవితంలో దేవాదుల ప్రాజెక్టు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

**పథకాలకు లంచాలిస్తే ఊరుకోం**

ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని కడియం స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ తదితర పథకాల్లో అవినీతికి తావులేకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిజాయితీగా పనిచేయాలని సూచించారు. అర్హులైన పేదలకే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెళ్లి అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుల ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

## ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలి మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు

**తల్లాడ/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు సూచించారు. శనివారం తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా2026 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి నీరు పోశారు.
మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారు సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్క నినాదంతో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దొడ్డ శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరం ఒక చెట్టు నాటుదాం. ప్రకృతిని కాపాడుదాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయురాలు గిరిజారాణి, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, నాయకులు పొన్నం కృష్ణయ్య, షేక్ నాగు, గొడ్ల సీతారాములు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



# మాదిగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

## అధ్యక్షుడిగా పోలెపాక ఉప్పలయ్య.. ప్రధాన కార్యదర్శిగా మూరగుండ్ల యాదగిరి

**కేసముద్రం/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండలంలోని శ్రీలక్ష్మి సాయి గార్డెన్‌లో శుక్రవారం మాదిగ సంక్షేమ సంఘం తొలి సమావేశం నిర్వహించారు. సంఘం భవిష్యత్ కార్యాచరణ, విధివిధానాలపై చర్చించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
అధ్యక్షుడిగా పోలెపాక ఉప్పలయ్య (ఉప్పరపల్లి), ప్రధాన కార్యదర్శిగా మూరగుండ్ల యాదగిరి (కల్వల), ఉపాధ్యక్షులుగా మంద సాయిబాబా (ఉప్పరపల్లి), సోమారపు మదర్ (కేసముద్రం), సహాయ కార్యదర్శిగా చింతకుంట్ల వెంకన్న (ధనసరి), కోశాధికారిగా పందుల సారయ్య (కేసముద్రం) ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులు, ఆడిట్ కమిటీ సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ సభ్యుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం



**నెక్కొండ/ సెప్టెంబరు 19 (జర్నలిస్ట్ వార్త):**
కుటుంబానికి పెద్ద దిక్కుగా, తండా ప్రజలకు ఆప్తుడిగా ఉన్న బానోతు బీఖ్య నాయక్ మృతి చెందడంతో గొట్లకొండ కాలనీ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.
ఐదేళ్ల క్రితం భార్య పీక్లీబాయిని కోల్పోయిన బీఖ్య నాయక్ అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబరు 18న ఆయన తుదిశ్వాస విడిచారు. మనవడు నరేశ్ బొంబాయి నుంచి రావడంతో శనివారం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. బీఖ్య నాయక్‌కు కుమారులు రెడ్యా నాయక్, శంకర్ నాయక్‌తో పాటు మనవళ్లు ఉన్నారు. తండా ప్రజలకు అందుబాటులో ఉంటూ తనవంతు సేవలందించిన ఆయన అందరి మన్ననలు పొందారని స్థానికులు



గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి తండాకు తీరని లోటని, కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన బాధ మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు.

# రామన్నపాలెంలో వైభవంగా గణనాథుని ఊరేగింపు



**వేంసూర్/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
రామన్నపాలెం గ్రామంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని ఊరేగింపును శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. డప్పులు, మేళతాళాలు, భక్తుల నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కృష్ణకుమారి వరప్రసాద్ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామస్థులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జాప్యం

## తల్లాడలో డీలర్ల తీరుపై కార్డుదారుల ఆగ్రహం



**తల్లాడ/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తల్లాడ మండలంలో సక్రమంగా సాగడం లేదని పలువురు కార్డుదారులు ఆరోపిస్తున్నారు. కొత్త స్మార్ట్ కార్డుల కోసం రేషన్ దుకాణాలకు వెళ్తున్న తమను కొంతమంది డీలర్లు నిర్లక్ష్యంగా తిప్పి పంపుతున్నారని వారు వాపోతున్నారు.
మీరు ఈ రేషన్ షాపులో బియ్యం తీసుకోవడం లేదు. మళ్లీ రేషన్ వచ్చినప్పుడు రండి అంటూ కొందరు డీలర్లు సమాధానం చెబుతున్నారని కార్డుదారులు పేర్కొంటున్నారు. ఒక్కరిద్దరు వస్తే కార్డులు ఇవ్వబోమని చెప్పడంతో పాటు, ప్రశ్నించిన వారితో వాగ్వాదానికి దిగుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కనిపించడం లేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన ప్రతి కార్డుదారుడికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. రేషన్ దుకాణాలను తనిఖీ చేసి, పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆపదలో ఉన్న వారికి ఆర్థిక భరోసా





**హసన్‌పర్తి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వైద్య చికిత్స కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ చెక్కులను హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఐనవోలు మండలం కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన తంజీలకు రూ.2.50 లక్షలు, హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బండి మంజులకు రూ.2.50 లక్షల విలువైన చెక్కులను అందించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చిర్ర విజయ్, శ్రీరాములు, తిరుపతి, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనకల్‌లో ఘనంగా మరియతల్లి మహోత్సవం



**తల్లాడ/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం నూతనకల్ విచారణ పరిధిలో పరిశుద్ధ లాసలేట్ మరియతల్లి మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు రెవ. ఫా. నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఖమ్మం రోమన్ క్యాథలిక్ పీఠాధిపతి డా. సగిలి ప్రకాష్ డీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిషప్ ప్రకాష్ మాట్లాడుతూ మరియతల్లి బోధనలు విశ్వాసులకు మార్గదర్శకమని అన్నారు. తొమ్మిది రోజులుగా నవదిన ప్రార్థనలు, జపమాలలు, దివ్యబలిపూజలు నిర్వహించిన విచారణ గురువులు, ఉపదేశికులు, సంఘ పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ, మిట్టపల్లి విచారణ గురువులు, సిస్టర్స్, ఉపదేశికులు, సంఘ పెద్దలు, మరియదళం సభ్యులు, విశ్వాసులు, భక్తులు పాల్గొన్నారు.

# పండగలతో మతసామరస్యం పెంపొందాలి



**తల్లాడ/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** పండగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు మతసామరస్యాన్ని పెంపొందించుకోవాలని మాజీ సర్పంచ్‌లు శీలం కోటారెడ్డి, శివపార్వతి దంపతులు అన్నారు. రామానుజవరం గ్రామంలోని బీసీ కాలనీలో గణేష్ నవరాత్రుల ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.
ముందుగా గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలపై విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. అన్నదాతలను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిన్నెర వెంకట కృష్ణవేణి, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డిజిటల్ సర్వేలో పంటలు నమోదు చేసుకోవాలి

## ఏవో మండ రాజ్‌కుమార్



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** వానాకాలంలో సాగు చేసిన పంటల వివరాలను ప్రతి రైతు తప్పనిసరిగా డిజిటల్ పంట సర్వేలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మండ రాజ్‌కుమార్ సూచించారు. పంట నమోదు చేసుకున్న రైతులకే ధాన్యం విక్రయంతో పాటు పత్తిని సీసీఐకి విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు.మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో పంట సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో వివరాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించి తమ పంటలను నమోదు చేయించుకోవాలని కోరారు. చింతలపల్లి, పెంచికల్‌పేట, సూరారం గ్రామాల్లో జరుగుతున్న డిజిటల్ పంట సర్వేను పరిశీలించారు. ఏఈవోలు పున్నం చందర్, బాబు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మహిళా మార్ట్ పనులపై అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




**తల్లాడ/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** మండలంలో నిర్మాణంలో ఉన్న మహిళా మార్ట్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డా. శ్రీజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతి, పూర్తయిన పనులు, పెండింగ్ పనుల వివరాలను ఎంపీడీవో శ్రీధర్‌రాజు, అటవీశాఖ బీట్ ఆఫీసర్ సిద్ధారావును అడిగి తెలుసుకున్నారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలు, అటవీశాఖ ద్వారా గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి మహిళా మార్ట్ దోహదపడుతుందని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న మహిళా మార్ట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# దామెరలో పోషణ మాసం

## అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ పద్మ



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో శనివారం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు శ్యామల, త్రివేణి, ప్రేమలత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మంకని పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ మాట్లాడుతూ తల్లి పాలు శిశువులకు శ్రేష్ఠమైనవని, తప్పనిసరిగా తల్లి పాలు అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయించి పాఠశాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, ఏఎన్ఎం వసంత, ఉపాధ్యాయురాలు శారద, ఆశా కార్యకర్తలు నర్మద, శ్రీలత, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మీసేవ ద్వారా కూడా ఎరువుల బుకింగ్

**ధర్మసాగర్/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
రైతులకు ఎరువుల బుకింగ్‌ను మరింత సులభతరం చేసేందుకు మీసేవ కేంద్రాల్లోనూ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ధర్మసాగర్ వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ (ఫర్టిలైజర్స్ సేల్) దరఖాస్తు ద్వారా ఇప్పటికే ఎరువులు బుక్ చేసుకునే అవకాశం ఉండగా, తాజాగా మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా కూడా బుకింగ్ చేసుకోవచ్చన్నారు.రైతులు ఆధార్ వివరాలు, ఓటీపీ ద్వారా సమీపంలోని మీసేవ లేదా కామన్ సర్వీస్ కేంద్రాల్లో ఎరువులు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎరువుల బుకింగ్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ఎరువుల బుకింగ్ కోసం ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మండ రాజ్‌కుమార్ సూచించారు.
కేంద్ర ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, మొబైల్ ద్వారా నమోదు చేసుకోవడంలో కొందరు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సౌకర్యార్థం మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో ఎరువుల బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ఇందుకు రూ.15 సేవా రుసుము చెల్లించాల్సి ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాజ్‌కుమార్ కోరారు.

# మహా అన్నదానంలో చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ నాయక్



**మహబూబాబాద్/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ పట్టణంలోని 22, 32, 34వ వార్డుల్లో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు.ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం మహోన్నతమైన సేవ అని చైర్‌పర్సన్ అన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుటుంబాలకు గణనాథుని ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం యూత్ సభ్యులు చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ పద్మం ధనలక్ష్మి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జమీల్, 34వ వార్డు యూత్ సభ్యుడు రాజీవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై బీజేపీ ధర్నా

## ఏఈకి వినతిపత్రం



**నేలకొండపల్లి/ సెప్టెంబరు 19(జర్నలిస్ట్ వార్త):**
వ్యవసాయానికి విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొత్తకొత్తూరు విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. 'సీఎం డౌన్ డౌన్ , కరెంటు కోతలు ఆపాలి అంటూ నినాదాలు చేశారు.బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలకు నీరందక నాట్లు ఎండిపోతున్నాయని తెలిపారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఈ గుద్దేటి రవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాజా రామకృష్ణ, సూరపల్లి జ్ఞానరత్నం, కూరాకుల దివాకర్, కొండా హర్షవర్ధన్, పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నిజాం చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన




**మహబూబాబాద్/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
గణేష్ నిమజ్జనానికి నిజాం చెరువులో చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు.
చెరువు చుట్టూ పటిష్టమైన బారికేడ్లు, విద్యుత్ సరఫరా, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు చెరువులోకి వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుర్ణపు సోమయ్య, కమిషనర్ వినోద్ కుమార్, డీఎస్పీ తిరుపతి, సీఐ అంజలి, ఏఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ



**కేసముద్రం/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో సాక్షి గణపతి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణపతి స్వామి ఆశీస్సులు కేసముద్రం ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణ



**మహబూబాబాద్/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్‌లోని మైత్రి హాస్పిటల్‌లో డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ సుచిత్ర దంపతుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఐదు రోజులుగా నిత్య పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ సుచిత్ర మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో కలిగే కాలుష్యాన్ని నివారించాలని కోరారు. ఏటా తమ ఆస్పత్రిలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వీరన్న, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రమేష్, డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ రాంరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మహమూద్‌పట్నం మత్స్య సంఘం ఏకగ్రీవం



**కేసముద్రం/సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** మహమూద్‌పట్నం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా మత్స్యశాఖ ఎన్నికల అధికారి భరత్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.అధ్యక్షుడిగా పోలు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పిట్టల ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా పోలు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పోలు గణేష్, అశోక్, నారాయణ, వెంకన్న, సుధాకర్, దశరథం ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు పిట్టల విజేందర్ నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది.నూతన పాలకవర్గానికి గ్రామస్థులు, మత్స్యకారులు అభినందనలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

## ఆపన్నహస్తాలతో అఖీరా వైద్య కల సాకారం





**వరంగల్)సెప్టెంబరు 19 (జర్నలిస్ట్ వార్త):** వైద్య విద్య అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న పేద విద్యార్థిని కొండేటి అఖీరాకు పలువురు దాతలు అండగా నిలిచారు. సామాజిక మాధ్యమాల ద్వారా అఖీరా పరిస్థితిని తెలుసుకున్న దాతలు స్పందించి సుమారు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందించారు.డీడీ కోసం అఖీరా బ్యాంకు ఖాతా ఫ్రీజ్ కావడంతో సమస్య ఎదురైంది. సేవాభావులు బ్యాంకు అధికారులను సంప్రదించి పరిస్థితిని వివరించడంతో డీడీ జారీ అయ్యింది. అనంతరం శనివారం అఖీరాను హైదరాబాద్‌లోని మహేశ్వర మెడికల్ కాలేజీకి తీసుకెళ్లి, అవసరమైన ప్రక్రియ పూర్తి చేయించి చేర్పించారు. తన చదువుకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అఖీరా, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు-సేవాలాల్ సేన.



**బయ్యారం/,సెప్టెంబర్ 19.(జర్నలిస్ట్ వార్త)**
భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ రచించిన పుస్తకంలో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై సేవాలాల్ సేన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం బయ్యారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ మాట్లాడుతూ..అంబేద్కర్ కల్పిత నాయకుడంటూ పుస్తకంలో పేర్కొనడం ఆయన చారిత్రక పాత్రను,మహోన్నత సేవలను అవమానించడమేనని మండిపడ్డారు.అంబేద్కర్ ఒక్క వర్గానికి చెందినవారు కాదని,దేశమంతా గర్వించదగిన జాతీయ నాయకుడని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సేన నాయకులు అజ్మీర వీరన్న నాయక్,రమేష్, శ్రీకాంత్,వెంకన్న, భాష్య,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగుకు నీరందించక రైతులను అయోమయంలో పడేశారు.



**బయ్యారం/,సెప్టెంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**సాగు నీటి విడుదలపై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు రైతులను అయోమయంలోకి నెట్టారని బీజేపీ జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాసరావు ఆరోపించారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారుల సూచనలతో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, ఆ తర్వాత వరి వేయొద్దని ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారన్నారు. అయితే కాలువల మరమ్మతులు చేయకుండా, నీటి విడుదలపై స్పష్టమైన కాలపట్టిక ప్రకటించకపోవడంతో రైతులు తీవ్ర నష్టపోతున్నారని మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు చేశారు: బాధితులైన రైతులకు ఎకరానికి ₹50,000 ఆర్థిక సాయం అందించాలి.చెరువులోని నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలకు నీటిని విడుదల చేస్తూ ఖచ్చితమైన టైమ్‌టేబుల్ ప్రకటించాలి.ఆయకట్టు చివరి భూముల వరకు కాలువల మరమ్మతులు చేపట్టి, రైతులకు ఆరుతడి పంటల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలి.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నంబూరి రామకృష్ణయ్య, రేఖ ఉప్పలయ్య యాదవ్, ఆడపు జై కుమార్, దేరంగుల రాంబాబు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న బయ్యారం సర్పంచ్.




**బయ్యారం/,సెప్టెంబర్ 19.(జర్నలిస్ట్ వార్త)**
దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2, 2026 వరకు నిర్వహిస్తున్న "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమంలో భాగంగా బయ్యారం మేజర్ గ్రామపంచాయతీలో గాంధీసెంటర్ లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. "సమష్టి కృషి – స్పష్టమైన మార్పు" అనే నినాదంతో చేపట్టిన ఈ సామూహిక శ్రమదాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ పాల్గొని మాట్లాడారు.
పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని బయ్యారాన్ని స్వచ్ఛంగా,ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించి, ప్లాస్టిక్ నిషేధం,పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రతినిధులు,సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఐ సంజీవరావుకు సన్మానం



**వర్ధన్నపేట/ సెప్టెంబరు 19(జర్నలిస్ట్ వార్త);** నూతనంగా బాధ్యతలు చేపట్టిన వర్ధన్నపేట సీఐ సంజీవరావును ఎంఆర్‌పీఎస్‌ఎంఎస్‌పీ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ సంజీవరావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఎంఆర్‌పీఎస్‌ఎంఎస్‌పీ వర్ధన్నపేట మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ, మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు చాడ కర్ణాకర్ మాదిగ, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ, అంబేద్కర్‌నగర్ గ్రామశాఖ అధ్యక్షుడు మారపాక బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ మానవత్వం..

### కాన్వాయ్ ఆపి ప్రమాద బాధితులకు సాయం



**సిద్దిపేట సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు.శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

## నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి

### గీసుగొండ సీఐ విశ్వేశ్వర్





**గీసుగొండ/సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. కట్ట మల్లన్న చెరువు కట్ట, నిమజ్జన ప్రాంతాలను అధికారులు సంయుక్తంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు.భక్తులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, బారికేడ్లు దాటి చెరువులోకి వెళ్లరాదని సూచించారు. చిన్నారులను నీటి వద్దకు తీసుకెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తారని తెలిపారు. మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా వారు వెంట ఎస్సై అనిల్, స్థానిక అధికారులు నాయకులు ఉన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** కొనారెడ్డి చెరువు వద్ద గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని డీసీపీ రాజా మహేంద్ర నాయక్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, విగ్రహాల ఊరేగింపులకు ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, విద్యుత్, పారిశుధ్యం, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సంజీవరావు, ఎస్సై సాయిబాబు, మున్సిపల్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేవంత్ పిలుపు.. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు పేర్లు సూచించిన దర్శకుడు సందీప్ వంగా

**హైదరాబాద్ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**
వరంగల్‌లో కొత్తగా నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి తగిన పేర్లను సూచించాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుపై సినీ పరిశ్రమ నుండి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా, వరంగల్ బిడ్డ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ క్రమంలో రెండు పేర్లను ప్రతిపాదించారు. తన సొంత పట్టణంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కానుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.
వరంగల్ చారిత్రక వైభవాన్ని, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ విమానాశ్రయానికి పేరు ఉండాలని సందీప్ వంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, 'రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం



(=×రూ)', 'కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం (ఖ×రూ)' అనే పేర్లను ఆయన ప్రతిపాదించారు. వరంగల్ వాసుల చిరకాల స్వప్నమైన ఈ ప్రాజెక్టును సాకారం చేస్తున్నందుకు ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.సందీప్ వంగాతో పాటు టాలీవుడ్‌కు చెందిన మరికొందరు ప్రముఖులు సైతం ఈ అంశంపై స్పందించారు. 'దసరా' చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఓదెల 'సమ్మక్క-సారలమ్మ అంతర్జాతీయ విమానాశ్రయం' పేరును ప్రతిపాదించగా, నటుడు మరియు నిర్మాత బండ్ల గణేశ్ 'రాణి రుద్రమదేవి అంతర్జాతీయ విమానాశ్రయం, వరంగల్' అనే పేరు సముచితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.
మరోవైపు, ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (దిల్ రాజు) సైతం విమానాశ్రయ నిర్మాణ నిర్ణయాన్ని స్వాగతించింది. ఈ విమానాశ్రయం ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, వరంగల్ పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లకు మరింత వెసులుబాటు, ప్రోత్సాహం లభిస్తుందని ఆ సంస్థ పేర్కొంది.

## జన్వాడ ఫాంహౌస్.. నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే: కాంగ్రెస్ ఎంపీలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**
రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన



ఆరోపణలు చేశారు.
ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు.
గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతభిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.